ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ. 09.05.2026 సమయం. 13.10 గంటలు

ముఖ్యాంశాలు

1. ఉమ్మడి జిల్లా కేంద్రాల్లో మైనార్టీల కోసం ప్రత్యేక డిగ్రీ కళాశాలలు ఏర్పాటు చేయాలని అధికారులను సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు.

2. ప్రధానమంత్రి నరేంద్రమోదీ హైదరాబాద్ పర్యటన నేపథ్యంలో అధికారులు గట్టి భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు. పర్యటనలో భాగంగా సుమారు 8 వేల కోట్ల రూపాయల విలువైన అభివృద్ధి పనులకు ప్రధాని శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నారు.

3. బీఆర్ఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన కరీంనగర్ బంద్ పాక్షికంగా కొనసాగుతోంది.

4. మేడిగడ్డలోని మూడు పిల్లర్లకు మరమ్మతులు చేస్తే కేసీఆర్‌కు పేరు వస్తుందనే భయంతోనే, ప్రభుత్వం తుమ్మిడిహట్టి నిర్మాణం అంటూ కొత్త మోసానికి తెరలేపిందని మాజీ మంత్రి హరీష్ రావు విమర్శించారు.

**ప్రత్యేక డిగ్రీ కళాశాలలు**

ఉమ్మడి జిల్లా కేంద్రాల్లో మైనార్టీల కోసం ప్రత్యేక డిగ్రీ కళాశాలలు ఏర్పాటు చేయాలని అధికారులను సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. వీటిలో నైపుణ్యాభివృద్ధి, ఏఐ బోధనకు ప్రాధాన్యం ఇస్తూ ఉపాధి అవకాశాలు పెంచాలని సూచించారు. ఇమామ్, మౌజమ్‌ల గౌరవ వేతనాలను క్రమం తప్పకుండా విడుదల చేయాలని, ఖబరస్థాన్‌లకు భూములు కేటాయించాలని తెలిపారు. మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్టులో భాగంగా అన్ని మతాల ప్రార్థనా

మందిరాల నిర్మాణం చేపట్టాలని ఆదేశించారు. మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి అజారుద్దీన్, ఇతర ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్షలో విద్యార్థులకు ప్రోత్సాహకాలు, ఆటోల రెట్రోఫిటింగ్ వంటి కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఈ సమావేశంలో షబ్బీర్ అలీ, ఫహీం ఖురేషి తదితరులు పాల్గొన్నారు.

DESK

**రేవంత్‌రెడ్డి**

నాంపల్లి హజ్ హౌస్‌లో యాత్రికుల బస్సును ప్రారంభించిన సీఎం రేవంత్‌రెడ్డి, ఓటరు సవరణ పేరిట సాగుతున్న కుట్రలను తెలంగాణలో సాగనివ్వమని స్పష్టం చేశారు. హిందూ ముస్లింలను రెండు కళ్లుగా భావిస్తూ మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, విమాన ఇంధన చార్జీల భారాన్ని ప్రభుత్వమే భరిస్తుందని వెల్లడించారు. హైదరాబాద్‌లోని రెండు లక్షల డీజిల్ ఆటోలను ఉచితంగా ఎలక్ట్రిక్ వాహనాలుగా మారుస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్ర అభివృద్ధి కోసం ప్రార్థించాలని యాత్రికులను కోరారు. మంత్రి అజారుద్దీన్ హజ్ సౌకర్యాలను వివరించగా, ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ యాత్రికులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో షబ్బీర్ అలీ, షఫీయుల్లా తదితర నేతలు పాల్గొన్నారు. తెలంగాణను నంబర్ వన్ రాష్ట్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని ఈ సందర్భంగా నేతలు పునరుద్ఘాటించారు.

DESK

**ప్రధాని మోదీ హైదరాబాద్ పర్యటన**

ప్రధాని మోదీ రేపు హైదరాబాద్‌లో పర్యటించనున్నారు. మూడోసారి ప్రధానిగా బాధ్యతలు చేపట్టాక వస్తున్న ఆయన, హెచ్ఐసీసీలో సుమారు రూ.8 వేల కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నారు. జహీరాబాద్ స్మార్ట్ సిటీ, జాతీయ రహదారి పనులు, ఐటీసీ టెర్మినల్ వంటి కీలక ప్రాజెక్టులు ఇందులో ఉన్నాయి. అనంతరం పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించే భారీ బహిరంగ సభలో ఆయన పాల్గొంటారు. ఈ పర్యటన కోసం సీఎస్ రామకృష్ణారావు నేతృత్వంలో అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేయగా, బీజేపీ శ్రేణులు నగరవ్యాప్తంగా ఫ్లెక్సీలు, బ్యానర్లతో సందడి చేస్తున్నాయి.

DESK

**సిర్పూర్ ఎమ్మెల్యే**

ఆసిఫాబాద్ జిల్లాలోని కాగజ్ నగర్ రైల్వే స్టేషన్ నుండి రేపు హైదరాబాద్ లోని పరేడ్ మైదానంలో నిర్వహించే ప్రధాని నరేంద్ర మోడీ బహిరంగ సభకు ప్రత్యేక రైలు సౌకర్యం కల్పిస్తున్నట్లు సిర్పూర్ బిజెపి ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నియోజకవర్గం నుండి 2 వేల మందిని సభకు తరలించేందుకు సన్నాహాలు చేస్తున్నట్టు తెలిపారు.

పిటిసి, ఆసిఫాబాద్

**కేటీఆర్**

త్వరలోనే బీఆర్ఎస్ సభ్యత్వ నమోదు, కొత్త కమిటీలు వేస్తామని, యువతకు అవకాశం ఇస్తామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారక రామారావు అన్నారు. నిన్న రాజన్న సిరిసిల్ల జిల్లాలోని పలు గ్రామాల్లో జరిగిన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. వీర్నపల్లి మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. యుద్ధానికి ఎలాగైతే సిద్ధమవుతామో రానున్న ఎన్నిక ల్లో కూడా అలాగే సిద్ధంగా ఉండాలని, బీఆర్ఎస్ నాయకులు కేసులకు భయపడవద్దని అన్నారు. మున్సిపాలిటీల్లో గెలిచినట్టే పరిషత్ ఎన్నికలు పెడితే గట్టిగా పోటీ ఇచ్చి గెలవాలన్నారు. పండించిన ధాన్యం తూకం వేసేందుకు రైతులు లంచాలు ఇవ్వాల్సిన దుస్థితి నెలకొందని ఆరోపించారు. మక్కల కొనుగోళ్లకు ప్రభుత్వం కనీసం గన్ని బ్యాగులు సరఫరా చేయడం లేదన్నారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ కి ప్రజా సంక్షేమం, రైతుల సంక్షేమంపై అవగాహన లేదని, కేవలం మత రాజకీయాలు మాత్రమే తెలుసని విమర్శించారు.

పిటిసి, రాజన్న సిరిసిల్ల

**జనగణన - వనపర్తి**

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తొలిసారి నిర్వహిస్తున్న డిజిటల్ జనగణనలో ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొని జనగణనను విజయవంతం చేయాలని వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ సురభి సూచించారు. ప్రతి ఒక్క భారతీయుడు రేపటితో ముగియనున్న సెల్ఫ్ ఎన్యూమరేషన్

(స్వీయ జనగణన)లో తామంతట తాము తమ వివరాలను నమోదు చేసుకోవాలని కోరారు. ప్రజా సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు అమలుచేయడం ద్వారా దేశాభివృద్ధిలో జనగణన కీలక పాత్ర పోషిస్తుందన్నారు.

పిటిసి, వనపర్తి

**మారథాన్**

ఇవాళ ఉదయం వనపర్తి జిల్లా కేంద్రంలో ముఖ్య ప్రణాళిక శాఖ అధికారి, జనగణన జిల్లా అధికారి ఆధ్వర్యంలో నిర్వహించిన మారథాన్ కార్యక్రమానికి వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ముఖ్యఅతిథిగా హాజరై జండా ఊపి ప్రారంభించారు.

**బైట్: ఆదర్శ సురభి**

స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానం నుండి పాలిటెక్నిక్ కళాశాల వరకు మారథాన్ కార్యక్రమంలో ఆయా ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బంది, క్రీడాకారులు, తదితరులు పాల్గొన్నారు.

పిటిసి, వనపర్తి

**ఆకాశవాణి 90 వసంతాలు**

ఆకాశవాణి 90 వసంతాల ఉత్సవాల సందర్భంగా ఆకాశవాణిలో వచ్చే వార్తలు వాస్తవాలకు నిదర్శనమని ఖమ్మంకు చెందిన డాక్టర్ మారంరాజు రంగారావు చెప్పారు. తాను చిన్నతనం నుంచి రేడియో వింటానని, అప్పుడు ప్రసారమైన బాలానందం కార్యక్రమం అంటే తనకు ఎంతో ఇష్టమని చెప్పారు. ఇప్పటికీ ప్రతిరోజు రేడియోలో ప్రసారమయ్యే వార్తలను వింటానని అన్నారు. రేడియో కార్యక్రమాలన్నీ కూడా పక్షపాతం లేకుండా నిజం తెలియజేసే విధంగా ఉంటాయని చెప్పారు.

**Sound byte …** Dr. మారంరాజు రంగారావు

పిటిసి, ఖమ్మం

**బీఆర్ఎస్ పార్టీ బంద్**

తమ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంపై బీజేపీ దాడిని నిరసిస్తూ బీఆర్ఎస్ పిలుపునిచ్చిన కరీంనగర్ బంద్ పాక్షికంగా కొనసాగుతుంది. బంద్‌ను అడ్డుకుంటామని బీజేపీ హెచ్చరించగా, ఈ దాడులతో తమకు సంబంధం లేదని కాంగ్రెస్ స్పష్టం చేసింది. పోలీసులు భారీగా మోహరించి ఎమ్మెల్యే గంగుల కమలాకర్‌ను గృహనిర్బంధం అరెస్టు చేశారు. దీంతో కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తం చేస్తూ నల్ల జెండాలతో అక్కడే కూర్చొని ఆందోళనకు దిగారు ప్రభుత్వంపై బండి సంజయ్ కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ఆందోళన చేపట్టారు. పరిస్థితిని అదుపు చేయడానికి పోలీసులు ఎమ్మెల్యే గంగుల కమలాకర్ బలవంతంగా అరెస్ట్ వాహనం లో ఎక్కించి చేసి సిటిసి కు తరలించారు. అంతకుముందు గంగుల కమలాకర్ మీడియాతో మాట్లాడుతూ... దాడికి పాల్పడిన వారిపై తప్పనిసరిగా చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని అన్నారు.

PTC, KRMNR

**ఇంటి పన్ను వసూలు**

రాజన్న సిరిసిల్ల జిల్లా 2025-26 ఆర్థిక సంవత్సరంలో 100 శాతం ఇంటి పన్ను వసూలు చేసి రాష్ట్రంలోనే రికార్డు సృష్టించింది. మొత్తం 260 పంచాయతీల్లో 7 కోట్ల 96 లక్షల రూపాయల లక్ష్యాన్ని చేరుకుని మొదటి స్థానంలో నిలిచింది. ఒక జిల్లాలో పూర్తిస్థాయి పన్ను వసూళ్లు కావడం రాష్ట్ర చరిత్రలో ఇదే తొలిసారి కావడమని పంచాయతీరాజ్ శాఖ వెల్లడించింది.

పిటిసి, రాజన్న సిరిసిల్ల

**హరీష్ రావు**

తుమ్మిడిహట్టి అంశంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు, వివేక్ వెంకటస్వామిలపై మాజీ మంత్రి హరీష్ రావు విమర్శలు చేశారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో హరీష్ రావు మాట్లాడుతూ... మేడిగడ్డ మూడు పిల్లర్లను మరమ్మతులు చేస్తే కేసీఆర్‌కు పేరు వస్తుందని.. తుమ్మిడిహట్టి నిర్మాణం అంటూ మోసానికి తెరలేపారని మండిపడ్డారు. మాజీ ముఖ్యమంత్రి కిరణ్ కుమార్ రెడ్డి హయాంలోనే 150 మీటర్లకు మహారాష్ట్ర ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని మంత్రి వివేక్

వెంకటస్వామి మాట్లాడడం పచ్చి అబద్ధమన్నారు. తమ్మిడిహట్టి నుంచి గ్రావిటీ ద్వారా నీళ్లు తెస్తామని మంత్రి జూపల్లి, సుందిళ్లకు నీళ్లు తెస్తామని ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఎల్లంపల్లికి నీళ్లు తెస్తామని సీఎం రేవంత్ రెడ్డి అవగాహన రాహిత్యంతో మాట్లాడుతున్నారని విమర్శించారు.

డెస్క్

**మన్నె క్రిశాంక్ విడుదల**

పలు కేసుల్లో గత 15 రోజులుగా సంగారెడ్డి జైలులో రిమాండ్‌లో ఉన్న బీఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ మన్నె క్రిశాంక్ ఈరోజు ఉదయం విడుదలయ్యారు. ప్రభుత్వం రాజకీయ కక్షతోనే క్రిశాంక్ ను అరెస్ట్ చేసిందని బీఆర్ఎస్ శ్రేణులు ఆరోపించాయి. క్రిశాంక్ కు పార్టీ నేతలు ఘన స్వాగతం పలికారు

**ఎస్పీ రోహిత్ రాజ్**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో సమర్ధవంతంగా విధులు నిర్వర్తించిన బాంబు డిస్పోజల్ బృందం సిబ్బందిని ఎస్పీ రోహిత్ రాజ్ అభినందించారు. మావోయిస్టుల సెర్చ్ ఆపరేషన్లలో 6 డంప్ లను, 5 ఆయుధాలను స్వాధీనం చేసుకోవడంలో వీరు సమర్థవంతంగా విధులు నిర్వర్తించారని వారిని ఎస్పీ ప్రశంసించారు. ఈ సందర్భంగా వారిని ప్రత్యేకంగా  సర్టిఫికెట్లను ప్రధానం చేశారు.

పిటిసి, భద్రాద్రీ కొత్తగూడెం

**పెద్దపల్లి ఎంపీ**

మంచిర్యాల జిల్లా లక్షటీపేటలో గోడ కూలిన ఘటనలో మరణించిన రైతుల కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృ ష్ణ భరోసా ఇచ్చారు. ప్రమాదం జరిగిన ప్రాంతాన్ని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తో కలిసి పరిశీలించారు. అనంతరం ఎంపీ వంశీకృష్ణ మాట్లాడుతూ... రైతుల సంక్షేమం కోసం తమ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందన్నారు. మృతుడు లచ్చన్న కుమారుడు మనోజ్ కు తక్షణమే అవుట్ సోర్సింగ్ ఉద్యోగం కల్పించాలని కలెక్టర్ కుమార్ కుమార్ దీపక్ కు  సూచించారు.

పిటిసి, మంచిర్యాల

**నల్గొండ కలెక్టర్**

నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఇంటి నంబర్లు, లింక్ డాక్యుమెంట్లు లేని 9,645 ఇండ్ల సమస్యల పరిష్కరిస్తామని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ తెలిపారు. రెవెన్యూ, మున్సిపల్ అధికారులతో కలిసి కలెక్టర్ పానుగల్, సుందరయ్య కాలనీల్లో క్షేత్రస్థాయిలో పర్యటించి, బాధితుల నుంచి వివరాలు సేకరించారు.

పిటిసి, నల్గొండ

**ఇంటర్ ప్రవేశాలు**

ఆసిఫాబాద్ జిల్లాలోని కాగజ్నగర్ పట్టణంతో పాటు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఉట్నూర్, నార్నూర్, ఇంద్రవెల్లి లలో ఉన్న ఏకలవ్య ఆదర్శ రెసిడెన్షియల్ విద్యాలయాల్లో ఇంటర్ ప్రవేశాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు **EMRS** ప్రిన్సిపాల్ రమేష్ రావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పదో తరగతి పాసైన విద్యార్థులు ఈనెల 15లోగా అప్లై చేసుకోవచ్చు.

పిటిసి, ఆసిఫాబాద్

**'జీరో షాడో"**

హైదరాబాద్ నగరంలో ఇవాళ మధ్యాహ్నం 12:12 గంటలకు 'జీరో షాడో" ఏర్పడింది. భూమి తన చుట్టూ తాను తిరుగుతూ సూర్యుడి చుట్టూ తిరిగే క్రమంలో.. సూర్య కిరణాలు భూమధ్య రేఖకు ఉత్తర, దక్షిణ దిశల్లో కర్కాట రేఖ నుంచి మకర రేఖ మధ్య నిలువుగా పడుతాయి. ఈ క్రమంలో సూర్యుడు సరిగ్గా 90 డిగ్రీల కోణంలో నడినెత్తి మీదకు వచ్చినప్పుడు.. వస్తువుల నీడలు వాటి కిందికి చేరిపోతాయి. ఫలితంగా నీడ కనిపించకుండా మాయమైనట్లు అనిపిస్తుంది.

DESK